
ప్రజాశక్తి

ఆదివారం 25 ఫిబ్రవరి 2024


5

పార్వతీపురం మన్యం



రూ.350కోట్లు ఫీడర్లు అభివృద్ధి : ట్రాన్స్‌కో ఎస్ఇ

మక్కువ : విజయనగరం పార్వతీపురం మన్యం ఉమ్మడి జిల్లాల్లో సుమారు 150 విద్యుత్ ఫీడర్ల అభివృద్ధికి రూ.350 కోట్లు నిధులు మంజూరైనట్లు ట్రాన్స్కో సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం.లక్ష్మణరావు తెలిపారు. ఇప్పటికే ఆరు ఫీడర్ల పనులు పూర్తయ్యాయని, ఇంకా 90 సాధారణ ఫీడర్లు, అలాగే 30 ఓవర్ లోడ్ ఫీడర్లు పనులు చేపడతామని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై శుక్రవారం మక్కువలో ఆందోళన చేపట్టిన నేపథ్యంలో శనివారం ఆయన ఎర్రసామంతవలస సబ్ స్టేషన్ పరిధిలోని రైతులతో మక్కువ సబ్ స్టేషన్ వద్ద సమావేశం నిర్వహించారు. ఆదివారం నుంచి మండలంలో9 గంటల వ్యవసాయానికి సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. మార్చి 10 నాటికి మక్కువలో రెండో పవర్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేస్తామని, దీంతో విద్యుత్ సరఫరా సమస్యలకు ఆస్కారం ఉండబోదన్నారు. బాకర్ల మరమ్మతు పనులు కూడా పూర్తిస్థాయిలో చేపడతామన్నారు. సరాయివలస, ఎస్ఆర్ పురం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు.



ఉత్కంఠకు తెర

- టిడిపి, జనసేన తొలిజాబితా విడుదల
- తొలివిడతగా ఎనిమిది మందికి అవకాశం
- నెల్లిమర్ల జనసేనకు కేటాయింపు
- చీపురుపల్లి, ఎస్.కోట, పాలకొండలో తప్పని ఎదురుచూపు

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మొత్తం 11 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను టిడిపి, జనసేన ఉమ్మడి జాబితాలో ఎనిమిది చోట్ల అభ్యర్థులను ప్రకటించింది. దీంతో, చాలా కాలంగా టిడిపి శ్రేణులు ఎదురు చూస్తున్న ఉత్కంఠకు తెరపడింది. మరో మూడు చోట్ల ఇంకా ఎదురు చూపు కొనసాగుతోంది. విజయనగరం జిల్లా నెల్లిమర్ల స్థానాన్ని జనసేనకు కేటాయించారు.



కోండ్రు మురళీమోహన్‌రావు
రాజాం - టిడిపి



లోకం నాగ మాధవి
నెల్లిమర్ల - జనసేన



ఆర్ఎస్‌వికెకె రంగారావు
బొబ్బిలి- టిడిపి



అదితి గజపతిరాజు
విజయనగరం -టిడిపి



కొండపల్లి శ్రీనివాస్
గజపతినగరం -టిడిపి



గుమ్మడి సంధ్యారాణి
సాలూరు - సాలూరు



తోయక జగదీశ్వరి
కురుపాం- టిడిపి



బోనెల విజయచంద్ర
పార్వతీపురం-టిడిపి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం నుంచి మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి విజయలక్ష్మి గజపతిరాజుకు మరోసారి అవకాశం కల్పించారు. ఆమె గత ఎన్నికల్లో పోటీచేసి, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిపై ఓడిపోయారు. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. గజపతినగరం అసెంబ్లీ అభ్యర్థిగా మాజీ ఎంపి కొండపల్లి పైడితల్లి నాయుడు మనుమడు కొండపల్లి శ్రీనివాస్ (కొండపల్లి కొండలరావు కుమారుడు)ను ప్రకటించారు. దీంతో, స్థానిక మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడుకు ఆశాభంగం కలిగింది. బొబ్బిలి నుంచి ఆ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్ఎస్‌వికెకె రంగారావు (బేబీ నాయన)ను రంగంలోకి దింపుతున్నారు. ఈసారి మాజీ మంత్రి, బేబీనాయన సోదరుడు ఆర్‌విఎస్‌కె రంగారావు పోటీ నుంచి తప్పుకున్నారు. రాజాం నియోజకవర్గం నుంచి అంతా ఊహించినట్టే మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ పేరును అధిష్టానం ఖరారు చేసింది. నెలిమర్ల నియోజకవర్గం నుంచి జనసేన నాయకులు లోకం మాధవి పేరు ఖరారు కావడంతో అక్కడ టిడిపి తరపున టిక్కెట్ ఆశించిన కర్రోతు బంగార్రాజు ఖంగుతిన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం నియోజకవర్గం బోనెల విజయ్‌కు, కురుపాం తోయక జగదీశ్వరికి అవకాశం లభించింది. సాలూరు నుంచి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుమ్మడి సంధ్యారాణికి అవకాశం కల్పించారు. విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి, ఎస్.కోట, మన్యం జిల్లాలోని పాలకొండ నియోజకవర్గాలకు ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు. దీంతో, ఆయా నియోజకవర్గాల్లోని ఆశావహుల్లో ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది.

మూడు చోట్ల ఎదురు చూపు

చీపురుపల్లి, ఎస్.కోట, పాలకొండ నియోజకవర్గాల్లోని ఆశావహులకు ఎదురు చూపులు తప్పలేదు. ముఖ్యంగా చీపురుపల్లి అసెంబ్లీ అభ్యర్థి ప్రకటన పెండింగ్‌లో ఉండడం, అటు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు కూడా ఎక్కడా సీటు కేటాయించకపోవడంతో ఆయనను చీపురుపల్లి నుంచి రంగంలో దింపాలన్న పార్టీ ఆలోచన మరింత బలపడినట్టుగా కనిపిస్తోంది. ఎస్.కోట అసెంబ్లీ స్థానం కోసం స్థానిక మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పాలకొండలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, పార్టీ నాయకులు పడాల భూదేవి, గేదెల రవి పేర్లు పరిశీలనలో ఉన్నట్టుగా సమాచారం. వీరిలో పార్టీ నేతలు చంద్రబాబు, లోకేష్ ఆశీస్సులు ఎవరికి ఉంటాయో వేచిచూడాల్సిందే.

పార్వతీపురంలో టిడిపి జెండా ఎగరేస్తాం : బోనెల

పార్వతీపురంరూరల్ : ఈసారి పార్వతీపురం సీటును అత్యధిక మెజార్టీతో గెలుచుకుని టిడిపి జెండాను ఎగురవేస్తామని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర అన్నారు. శనివారం రాష్ట్ర పార్టీ కార్యాలయం పార్వతీపురం టిడిపి అభ్యర్థిగా ఆయన పేరును ఖరారు చేయడంతో పార్టీ కార్యాలయంలో ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి. ఉదయం నుంచి ఆసక్తిగా ఎదురుచూస్తున్న టిడిపి శ్రేణులు, కార్యకర్తలు విజయచంద్ర పేరును చంద్రబాబు ప్రకటించడంతో ఒక్కసారిగా హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. పెద్దఎత్తున పార్టీ కార్యకర్తలు అభిమానులు, కార్యాలయానికి చేరుకుని ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం మందుగుండు సామాన్ల మోతతో పార్టీ కార్యాలయం నుంచి పార్వతీపురం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకం నిలబెట్టుకుని రాబోవు ఎన్నికల్లో పెద్ద ఎత్తున మెజార్టీ సాధించి చంద్రబాబుకు కానుకగా అందిస్తామని తెలిపారు. ఇప్పటికే వైసిపి పాలనతో విసిగిపోయిన ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని, ఈసారి టిడిపి ఎన్నడూ చూడని మెజారిటీతో పార్వతీపురం సీటును కైవసం చేసుకోబోతు ఒదన్నారు. పార్టీలోని సీనియర్లను, కార్యకర్తలను, అభిమానులను అందరినీ కలుపుకొని ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు ఆయన ప్రకటించారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విజయచంద్ర



జగదీశ్వరికి స్వీట్లు తినిపిస్తున్న నాయకులు, కార్యకర్తలు

గిరిజనుల కల సాకారం చేస్తా : జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: మా గిరిజనుల కల సాకారం చేసేందుకు నన్ను ఎమ్మెల్యే అభ్యర్థిగా నియమించడం పట్ల టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుకు, లోకేష్‌కు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి అన్నారు. జగదీశ్వరిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా స్వచ్ఛమైన గిరిజన అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించాలని గిరిజనులు కోరుకుంటున్నారని, ఈ నేపథ్యంలోనే తనకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించడం సంతోషంగా ఉందని అన్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో వచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

కష్టే ఫలే అన్నారు పెద్దలు... అందుకు తార్కాణం తోయక జగదీశ్వరి... ఆమెకు కురుపాం ఎమ్మెల్యే టికెట్ వరించింది... జగదీశ్వరికి ఇన్చార్జి బాధ్యతలు అప్పజెప్పిన నాటి నుంచి నేటి వరకు కురుపాం నియోజకవర్గంలో టిడిపి అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఆ ఫలితంగానే నేడు టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల టిక్కెట్ జాబితాలో జగదీశ్వరి పేరు నిలవడం విశేషం... రాజుల పాలనకు చెక్ పెడుతూ ఒక సామాన్య గిరిజన మహిళకు ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించడం పట్ల హర్షాతిరేఖలు వెల్లివిరుస్తున్నాయి. ఎంపిటిసి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి స్థాయికి వెళ్లడం పట్ల ఈ ప్రాంత గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం పట్ల గిరిజనులు, మైదాన ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కురుపాంలో ఎన్ని గ్రూపులు ఉన్నా టిడిపి ఎమ్మెల్యే టికెట్ జగదీశ్వరికే అంటూ పలుమార్లు 'ప్రజాశక్తి' కథనాలు వచ్చాయి... అదే నిజం చేస్తూ జగదీశ్వరని అధిష్టానం ఎమ్మెల్యే టికెట్ కేటాయించడం విశేషం.



సంధ్యారాణికి అభినందనలు తెలుపుతున్న కార్యకర్తలు, నాయకులు

పట్టునిలుపుకున్న సంధ్యారాణి

- సీనియారిటీకే పట్టం కట్టిన టిడిపి
- భంజ్ దేవ్ గ్రూపునకు భంగపాటు

ప్రజాశక్తి - సాలూరు

టిడిపిలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పొలిట్ బ్యూరో సభ్యులు సంధ్యారాణి తన పట్టు నిరూపించుకున్నారు. సామాన్య నాయకురాలి స్థాయి నుంచి పార్టీలో అత్యున్నత పొలిట్ బ్యూరో సభ్యురాలి స్థాయి వరకు ఆమె ఎదిగారు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆమె ఎస్టీ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2009 ఎన్నికలకు కొద్దిరోజుల ముందు ఆమె కాంగ్రెస్ నుంచి టిడిపిలో చేరి అనూహ్యరీతిలో ఎమ్మెల్యే సీటు సాధించుకున్నారు. అప్పటి నుంచి పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి పొలిట్‌బ్యూరో సభ్యురాలు, ఎమ్మెల్సీ పదవులను అలంకరించారు. 2014, 2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత నియోజకవర్గ ఇన్చార్జిగా సంధ్యారాణిని పార్టీ నియమించింది. అప్పటి నుంచి నియోజకవర్గ ఇన్చార్జి, పొలిట్ బ్యూరో సభ్యురాలు, అరుకు పార్లమెంటు పార్టీ అధ్యక్షురాలి హోదాలో ఆమె పార్టీ కార్యక్రమాలను చిత్తశుద్ధితో నిర్వహిస్తూ తనదైనశైలిలో ముందుకెళ్లారు. సంధ్యారాణికి ఉన్న సీనియారిటీని గుర్తించిన అధిష్టానం రానున్న ఎన్నికల్లో పోటీకి ఆమె పేరును ఖరారు చేసింది. దీంతో ఆమె అనుచరుల్లో ఆనందం అవధులు దాటిపోయింది. ఆమె నివాసంలో సందడి వాతావరణం నెలకొంది. టిడిపి నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు.

భంజ్‌దేవ్‌కు భంగపాటు

రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా సంధ్యారాణిని మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ వ్యతిరేకిస్తూ వచ్చారు. ప్రత్యామ్నాయంగా స్థానికేతర గిరిజన నాయకురాలు ఎం.తేజోవతిని తెరపైకి తీసుకొచ్చారు. తేజోవతి ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి పార్టీలో చేరారు. భంజ్‌దేవ్ అనుచరుల ఆశీస్సులు, టిడిపి రాష్ట్ర స్థాయి నాయకుల అండదండలతో టికెట్ తనకే వస్తుందని ఆమె భావించారు. అయితే పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిగా సంధ్యారాణి సేవలకు గుర్తింపుగా ఆమె పేరునే ఖరారు చేసింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ఆశీస్సులతో సంధ్యారాణి సీటు సాధించినట్లు తెలుస్తోంది. ఏమైనా పార్టీలో భంజ్‌దేవ్ గ్రూపు నాయకులకు తాజా పరిణామం మింగుడు పడడం లేదు. పార్టీ అధినాయకత్వం ఇంత తొందరగా ఎమ్మెల్యే అభ్యర్థి పేరు ప్రకటిస్తుందని భంజ్‌దేవ్ గ్రూపు నాయకులు ఊహించలేదు. సీటు ఖరారు చేసే ముందు అధిష్టానం మరోసారి తమను సంప్రదిస్తుందనే అభిప్రాయంతో భంజ్ దేవ్ వున్నారు. ఇటీవల శంఖారావం కార్యక్రమంలో పాల్గొనేందుకు సాలూరు వచ్చిన లోకేష్ సభ ముగిసిన తర్వాత తన కారులో భంజ్‌దేవ్, సంధ్యారాణి బాడంగి వరకు తీసుకెళ్ళారు. రానున్న ఎన్నికల్లో ఎలాగైనా సాలూరు నియోజకవర్గం టిడిపి అభ్యర్థిని గెలిపించాలని, ఇద్దరూ కలిసి పని చేయాలని కోరినట్లు తెలిసింది. అప్పుడు కూడా భంజ్‌దేవ్ తన మనసులోని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారనే వాదనలు వినిపించాయి.

పాలకొండపై వీడని ఉత్కంఠ

ప్రజాశక్తి-పాలకొండ

తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల తొలిజాబితా విడుదలలో పాలకొండ నియోజకవర్గానికి అభ్యర్థిని ప్రకటించక పోవడంతో పార్టీలో తీవ్ర చర్చకు దారి తీసింది. ఆది నుండి పాలకొండ టిడిపి టికెట్ విషయంలో గట్టి పోటీనే కనిపిస్తుంది. ఇన్‌ఛార్జి జయకృష్ణతో పాటు అనేక మంది ఆశావాహులు టికెట్ కోసం ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. 2014, 19 ఎన్నికల్లో జయకృష్ణకు టికెట్ ఇవ్వగా ఓటమి పాలయ్యారు. ఈసారి ఎలాగైనా అభ్యర్థిని మారిస్తేనే గెలుస్తామని పార్టీలో ఒక గ్రూపు పార్టీ అగ్రనాయకులకు చెబుతున్నట్లు తెలుస్తుంది. 2014 ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో జయకృష్ణ ఓటమి పాలయ్యారని, 2019లో వైసీపీ ప్రభంజనంలో జయకృష్ణ ఓటమి పాలయ్యారని, ఇప్పుడు ఆయనకే టికెట్ ఇవ్వాలని ఆయన అనుకూల వర్గం వాదిస్తున్నారు. అయితే తెలుగుదేశం పార్టీ నాయకురాలు పడాల భూదేవి టికెట్ ఆశిస్తూ చురుగ్గా తిరుగుతున్నారు. ఆమెకు నియోజకవర్గంలో ఒక బలమైన వర్గం మద్దతు ఉండడంతో ఆమె టికెట్ కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే జయకృష్ణ వర్గీయులు మాత్రం ఆమె స్థానికేతరులు అని ముద్ర వేస్తున్నారు. సీతంపేటకు చెందిన వ్యక్తికి టికెట్ ఇవ్వాలని నినాదం కూడా తెరపైకి వచ్చింది. దీంతో సీతంపేట మండలం నుంచి గేదెల రవి, హిమరిక ప్రసాద్, సవరతోట ముఖలింగం, సవర మాలయ్య పేర్లు కూడా వినిపిస్తు న్నాయి. తమలో టికెట్ ఎవరికి కేటాయించినా కలిసే పని చేసుకుం టామని వారు ఐక్యంగా టికెట్ కోసం పోరాటం చేస్తున్నారని తెలుస్తుంది. జయకృష్ణ కూడా కొద్దికాలం నుండి పార్టీ కార్యక్రమలు చురుగ్గా చేపడుతున్నప్పటికీ వ్యతిరేక వర్గాన్ని కలుపుకొని పోవడంలో సఫలీకృతం కాలేకపోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

జనసేనకు టికెట్?

టిడిపిలో అంతర్గత కుమ్ములాటలు ఉండటంతో ఈ నియోజకవర్గంలో పొత్తులో భాగంగా జనసేనకు టికెట్ ఇచ్చే అవకాశం ఉందని కొద్దిరోజులుగా ప్రచారం వినిపిస్తుంది. అయితే జనసేనలో కూడా టికెట్‌ను ఆశిస్తున్న వారు ఇద్దరు ఉన్నారు. అంతేకాక ఇక్కడ జనసేన, టీడీపీ మధ్య సమన్వయం కూడా పెద్దగా లేదనే చెప్పవచ్చు.

గ్రూపుల పోరుకు వాళ్లిద్దరే:

పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి ఖరారు విషయంలో ముఖ్యనేతల హస్తం ఉందని తెలుస్తుంది. టీడీపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు ఇంచార్జి జయకృష్ణను వ్యతిరేకిస్తున్నట్లు, పొలిట్ బ్యూరో సభ్యులు కళావెంకట్రావు జయకృష్ణకు అనుకూలంగా ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో పాలకొండ టిడిపి రాజకీయాలు ముదిరి పాకాన పడినట్లు ఉంది. ఏదీ ఏమైనా టికెట్ విషయంలో స్పష్టత ఇస్తే తప్ప పార్టీ కేడర్‌లో స్పష్టత వస్తుందని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు.

26న రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక రైల్వే స్టేషను ఆధునికీకరణ పనులకు ఈనెల 26న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నట్లు సిసిఐ ఎం.రవికిరణ్ తెలిపారు. శనివారం కలెక్టరు ఛాంబరులో కలెక్టరు నిశాంత్ కుమార్‌ను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. అమృత్ భారత్ స్టేషను స్కీంలో భాగంగా దేశవ్యాప్తంగా ఆధునీకరించిన 554 రైల్వేస్టేషన్లు, 1500 రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్‌లను ప్రధానమంత్రి ప్రారంభించ నున్నట్లు తెలిపారు. ఈ ఆధునికీకరణ పథకంలో భాగంగా ఈస్ట్‌కోస్ట్ రైల్వేలో 22 స్టేషన్లకు శంకుస్థాపనలు జరుగుతు న్నాయి. వీటిలో 12 స్టేషన్లు వాల్తేరు డివిజన్‌కు చెందినవని, పార్వతీపురం, సింహాచలం, కొత్తవలస, చీపురుపల్లి, శ్రీకాకుళం, నౌపడ, పర్లాకిమిడి, బొబ్బిలి, రాయగడ, కోరాపుట్, అరకు, జైపూర్ ఉన్నాయని, ఈ స్టేషన్లు రూ.500 కోట్ల పెట్టుబడితో ఆధునీకరించనున్నట్లు తెలిపారు. రూ.170 కోట్ల అంచనా వ్యయంతో 4 రోడ్డు ఓవరు బ్రిడ్జిల పనుల కోసం కూడా శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రైల్వే సిబ్బంది ఎ. సతీష్, పి.త్రివిక్రమ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న రైల్వే అధికారులు

బిందుసేద్యం ఏర్పాటుకు చర్యలు

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్


ప్రజాశక్తి - పార్వతీపురం

మండల కమిటీల్లో సభ్యులు కోరిన నీటి పైపులు, టార్పాలిన్లు, బింధు సేద్యం ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు సూచించారు. జిల్లాలో ఖరీఫ్ సీజనులో ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తిచేసినందుకు అభినందించారు. శనివారం స్థానిక కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం ఇన్‌ఛార్జి జాయింటు కలెక్టరు సి.విష్ణుచరణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి ఏర్పాటుచేసిన వ్యవసాయ సలహా మండలి చక్కగా పనిచేసిందన్నారు. ఇన్‌ఛార్జి జెసి మాట్లాడుతూ మండల, జిల్లా స్థాయిలో చర్చించిన అంశాల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్ వ్యవసాయ శాఖ నివేదికను సమర్పిస్తూ వ్యవసాయంలో ఆధునిక పద్దతులు ప్రవేశ పెట్టడం, అందులో భాగంగా నానో ఎరువులను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. ఈ ఎరువులను అన్ని ఆర్‌బికెల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. రబీ-23 సీజన్లో 70588 ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణానికి గానూ, నేటి వరకు 31605 ఎకరాల్లో రబీ పంటల సాగు చేపట్టడమైందని, రబీ-23 సీజన్లో 1,114 క్వింటా విత్తనాలను 4194 మంది రైతులకు పంపిణీ చేయగా, ఇందులో 547 క్వింటాళ్ల విత్తనాలను షెడ్యూల్డ్ మండలాల్లో 90శాతం రాయితీపై 2,399 మంది గిరిజన రైతులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. నువ్వు పంటకు 20 క్వింటాళ్ల విత్తనాలను 50శాతం రాయితీపై సరఫరా చేసేందుకు సిద్దం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 21384 మంది ఆర్ఒఎఫ్ఆర్ రైతులకు గాను 12480 మందికి ఇకెవైసి పూర్తిచేశామని, మిగిలిన 8904 రైతులకు మరో వారం రోజుల్లోగా ఇ-కెవైసి పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో 306 ఆర్‌బికెల పరిధిలో 302 నూతన భవనాలకు అనుమతి రాగా, నేటి వరకు 99 భవనాలను నిర్మాణాలను ఇంజనీరింగ్ శాఖ పూర్తి చేసి, వ్యవసాయ శాఖకు అందచేసిందన్నారు. మరో 173 భవనాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ఖరీఫ్-23 సీజన్లో 12,44,868 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఆర్‌బికెల ద్వారా గత ఖరీఫ్, రబీ సీజన్లలో 13,422 టన్నుల ఎరువులను రైతులకు పంపిణీ చేయగా, ఇంకా 650 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం మత్స్య, ఉద్యాన, నీటి పారుదల, ఇతర శాఖల అధికారులు, వారి శాఖలకు సంబంధించిన నివేదికలను, రైతుల సమస్యలకు సంబంధించిన పరిష్కార వివరాలను తెలిపారు. సమావేశంలో సివిల్ సప్లయి జిల్లా మేనేజరు దేవుళ్ల నాయక్, జిల్లా మత్స్యశాఖ అధికారి తిరుపతయ్య, జిల్లా ఉద్యాన అధికారి సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన నాగేశ్వరరావు

సుజల స్రవంతిపై వైసిపి భిన్న స్వరాలు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఒకే అంశం. సమస్య కూడా ఒక్కటే... ఒకటే పార్టీ.... కానీ, దానిపై భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. అదేదో ప్రతిపక్షమో... లేక మైనార్టీలోవున్న ఇతర పార్టీలో కావు. సాక్షాత్తు అధికార వైసిపి. ఎటొచ్చి సమస్య రైతులకు సంబంధించింది కావడం, అదీ వేలాది మంది రైతుల జీవితాలతోనూ, జిల్లా అభివృద్ధితోనూ ముడిపడి ఉండడంతో జిల్లాలో పబ్లిక్‌టాక్‌గా మారింది. ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు సాగునీరు, తాగునీరు అందించేపేరుతో ఈ జిల్లాలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ నిర్మాణానికి భూసేకరణకు సిద్ధపడుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుత కాలువ అలైన్‌మెంట్ వల్ల ఎక్కువ పంట భూములు కోల్పోవడంతోపాటు నిర్వహణ కష్టంగా ఉంటుందని, నీటి పంపిణీలోనూ ఇబ్బందులు తలెత్తుతాయని రైతులు, ఎపి రైతు సంఘం చాలా కాలంగా మొత్తుకుంటున్న సంగతి తెలిసిందే. దీనిపై ఎస్.కోట, గజపతినగరం మండలాల్లో సభలు, సమావేశాలు అనేకం జరిగాయి. ఈనెల 2వ తేదీన ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన జరిగిన భూ నిర్వాసితుల సదస్సుకు ఈ రెండు నియోజకవర్గాల నుంచీ పలువురు తాజా, మాజీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, రైతులు తరలివచ్చారు. వైసిపి తరపున ఎమ్మెల్సీ రఘురాజు కూడా హాజరైన సంగతి తెలిసిందే. ఇటు రైతులకు, అటు ప్రభుత్వానికి ఖర్చు తగ్గించడంతోపాటు లక్ష్యిత ఆయుకట్టుకు నీరు సునాయాశంగా వెళ్లేందుకు వీలుగా కాలువ అలైన్‌మెంట్ ప్రత్యామ్నాయం అన్వేషించాలని, అందుకోసం కలిసికట్టుగా పోరాడాలని ఆ సదస్సు తీర్మానించింది. ఈ డిమాండ్ ముమ్మాటికీ న్యాయమైన దేనని, దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, అవసరమైతే చట్ట సభల్లో ప్రస్తావిస్తానని కూడా ఎమ్మెల్సీ రఘురాజు హామీ ఇచ్చారు. నీటివాటం ఇంజినీర్లకన్నా రైతులకు ఎక్కువగా తెలుస్తుందని, ఇంజినీర్లు ఇక్కడ వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా ఎక్కడో కూర్చొని కాలువలు లేదా ప్రాజెక్టుల అలైన్‌మెంట్లు గీసేస్తుంటారని, ఉత్తరాంధ్ర సుజల ప్రసవంతి విషయంలోనూ అటువంటి తప్పిదమే జరిగిందని చెప్పారు. రైతులను ఒప్పించి భూములు తీసు కోవాలి తప్ప, నొప్పించి తీసు కోవడం ఎవరికైనా తగదన్నారు. 'అలైన్ మెంట్ తయారు చేసిన ఇంజి నీర్లకు బహుశా భూముల విలువ, భూములతో రైతులకు ఉన్న అను బంధం గురించి తెలీదేమో' అని విమర్శ కూడా చేశారు. కానీ, నిన్నగాక మొన్న అదే పార్టీకి చెందిన జిల్లా పరిషత్ చైర్మన్, వైసిపి జిల్లా సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 'రైతులేమైనా ఇంజినీర్లా.... కాలువల ఎలా ఏర్పాటు చేస్తుందో వారికి తెలియడానికి' అంటూ వ్యాఖ్యానించడం చర్చనీయాంశగా మారింది. కాలువల అలైన్‌మెంట్ మార్చే ఆలోచనే లేదంటూ కుండబద్దలు గొట్టినట్టు చెప్పడంతో రైతులు అగ్గిమీద గుగ్గిలమౌతున్నారు. ప్రస్తుత అలైన్‌మెంట్ ప్రకారం తాటిపూడి నుంచి గజపతినగరం, గుర్ల మండలాల మీదుగా సాగుతుంది. దీనికి పైన ఉన్న మెంటాడ, దత్తిరాజేరు, రామభద్రపురం, తెర్లాం, మెరకముడిదాం, బాడంగి, బలిజిపేట, బొబ్బిలి, రాజాం తదితర మండలాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని పంపాల్సి వస్తుంది. అదే మెంటాడ, రామభద్రపురం, బొబ్బిలి, బలిజిపేట మీదుగా అలైన్‌మెంట్ మార్పుచేస్తే భూదేవి జలాశయం నుంచి చిలకలగెడ్డ ఆంధ్ర జలాశయం, చంపావతి, వేగావతి, ఏడొంపులగెడ్డ, పోతులగెడ్డ తదితర నదులు, గెడ్డలను అనుసంధానం చేయవచ్చు. తద్వారా నిర్ధేశిత ఆయుకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించవచ్చు. ఆయుకట్టు ప్రాంతంలో 90శాతం భూమి దిగు భాగాన ఉండడం వల్ల లిఫ్ట్‌ల సంఖ్య, కాలువల నిర్మాణాకి ఖర్చు తగ్గుతుందని రైతులు, వారి తరపున సీనియర్ ఇంజినీరింగ్ నిపుణులు ఐఎస్ఎన్ రాజు తదితరులు చాలా కాలంగా చెబుతున్నారు. ఈ విషయమై సాగునీటి పారుదలశాఖ అధికారులు, ఆ శాఖకు చెందిన రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు, జిల్లాకు చెందిన బొత్స సత్యనారాయణలతో ఎపి రైతు సంఘం నాయకత్వంలో రైతులు చర్చించగా, వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు ఒక ప్రత్యేక కమిటీ కూడా వేసినట్టు సమాచారం. దానిపై చిత్తశుద్ధి మాత్రం కనింపించకపోవడంతో రైతులు సంఘటితమౌతున్నారు. ఈ సమస్య జిల్లాకు చెందిన నాయకులకు చాలా చిన్నదిగాను, పట్టీపట్టనట్టుగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బడా కాంట్రాక్టర్లకు లాభాలు చేకూర్చేవిధంగా కాలువ అలైన్‌మెంట్ చేస్తే... జిల్లాకు చెందిన నాయకులు అచేతనంగా వ్యవహరించడం సిగ్గుచేటనే చర్చ జిల్లాలో సర్వత్రా సాగుతోంది. ఎన్నికల ముందే ఇలా మాట్లాడితే... ఎన్నికలు అయ్యాక అసలు పట్టించుకునే పరిస్థితి కూడా ఉండబోదని రైతుల్లో చర్చనడుస్తోంది.

గుండెపోటుతో బ్యాంక్ మేనేజర్ మృతి

ప్రజాశక్తి- సాలూరు



సుదర్శనరావు(ఫైల్)

స్థానిక అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ తాలాడ సుదర్శనరావు (60) గుండెపోటుతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. విధులు నిర్వహించి ఇంటికొచ్చిన వుందని ఆయన ఇంటికి వెళ్లిన తరువాత గుండెపోటుకు గురయ్యారు. ప్రాథమిక చికిత్స కోసం స్థానిక ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. 1989లో ఆయన బ్యాంక్‌లో క్లర్క్‌గా చేరి మేనేజర్ స్థాయికి చేరారు. మృదుస్వభావి, వివాదరహితుడైన సుదర్శనరావు మృతి పట్ల బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, డైరెక్టర్లు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. తమ సహోద్యోగి సుదర్శనరావు గుండెపోటుతో మృతి చెందడంపై బ్యాంకు కార్యదర్శి బి.వేణుగోపాలరావు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పట్టణంలో జరిగే సామాజిక సేవాకార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే సుదర్శనరావు మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. సామాజిక కార్యకర్త కోడూరు సాయి శ్రీనివాసరావు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

కుసుమిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతంపేట



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిఎస్‌పి కృష్ణారావు

మండలంలోని కుసుమిలో సీతంపేట పోలీసుల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి సుమారు 300 మందికిపైగా గిరిజనులు హాజరయ్యారు. సీతంపేట, పాలకొండ ఏరియా ఆసుపత్రిల నుంచి, పిహెచ్‌సి - కుసిమి, విజయ మెడికల్ ఆస్పత్రి పాలకొండలోని ఏరియా ఆసుపత్రుల నుండి మొత్తం 9మంది వైద్యుల బృందం వీరిని పరీక్షించి 200 మందికి పైగా గిరిజనులకు రక్తపోటు, చక్కెర స్థాయిలు, గుండె ఆరోగ్యం ఇతర వ్యాధుల కోసం పరీక్షలు నిర్వహించారు. చికిత్స చేసి, ఖరీదైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం రోగులకు భోజనం అందజేశారు. ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పాలకొండ డిఎస్‌పి కృష్ణారావు మాట్లాడుతూ వైద్య శిబిరాన్ని గిరిజనులు వినియోగించుకోవాలని కోరారు. పాలకొండ సిఐ చంద్రమౌళి వైద్య శిబిరాన్ని పరీక్షించి, గిరిజన వృద్ధులకు గొడుగులు, దుప్పట్లు, యువతకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. సీతంపేట ఎస్ఐ ఎం.జగదీష్‌నాయుడు వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు ఆహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నీలకంఠాపురం ఎస్సై నీలకంఠ రావు, ఎంపిడిఒ కె.గీతాంజలి, సర్పంచ్ సవర కూర్మారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతి పత్రాన్నిస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టులపై దాడులకు నిరసన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రంలో జర్నలి స్టులపై దాడులకు నిరసనగా గుమ్మలక్ష్మీపురం వర్కింగ్ జర్నలిస్టులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన చేశారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో పలుచోట్ల విలేకరులపై అకారణంగా జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు ప్రభుత్వ పరంగా అమలు జరిపి విలేకరులు మీడియా సంస్థలపై దాడులు జరగకుండా చూడాలని తహశీల్దార్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్ట్ అధ్యక్షులు ఎస్ శ్రీనివాసరావు, కార్యదర్శి బి కుమార్‌స్వామి, గౌరవ అధ్యక్షులు పి. కొండలరావు పాల్గొన్నారు.

ఘనంగా చక్రస్నానం

ప్రజాశక్తి- గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ కోదండ రామస్వామి దేవస్థానమంలో శనివారం వెంకటేశ్వర స్వామికి ఘనంగా చక్ర స్నానం నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా ఆలయ అర్చకులు వి.వి.అప్పలాచార్యులు, వి.వి. శశిధర్, ఎమ్.గోవర్ధన్ ఆధ్వర్యంలో స్వామికి నిత్య ఆరాధనలు, విశేష హోమాలు నిర్వహించారు. స్వామివారి తిరువీధి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పవిత్ర నాగావళి నదిలో స్వామికి చూర్ణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి దంపతులు పాల్గొని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మర్రాపు సత్యనారాయణ, ధర్మకర్తల మండలి సభ్యులు గౌరీశంకర్ పాత్రో, గంటేడ సింహాచలం నాయుడు, కుసుమూరు సాగర్, నందివాడ కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని అప్పన్నదొరవలసలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ చీకటి శంకరరావు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన వెంటనే ఎఎన్‌ఎం, వైద్య సిబ్బందికి తెలియజేయాలని కోరారు. అంగన్వాడి కేంద్రంలో విద్యార్థులకు చిన్నారులకు బరువు, ఎత్తు సరిపోయిందో లేదో చూశారు. చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులకు అడిగి తెలుసుకుని అవగాహనపరిచారు. గ్రామంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాతృభాషా ఉపాధ్యాయులను కొనసాగించాలి

ప్రజాశక్తి- సీతంపేట

మాతృభాషా ఉపాధ్యాయులను మార్చి, ఏప్రిల్ నెలల్లో కూడా కొనసాగించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సవర డొంబు ఆధ్వర్యంలో ఎంఇఒ ఆనందరావుకు శనివారం వినతి పత్రాన్ని అందించారు. సమాన పనికి సమాన వేతనం మంజూరు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ కొండ ప్రాంతంలో ఉన్న పాఠశాలలో ఏకోపాధ్యాయులు ఉండడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడతారన్నారు. భాషా ఉపాధ్యాయులు ఉండడం వల్ల పాఠశాలలు క్లోజ్ అవ్వవని చెప్పారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - సీతానగరం



పరీక్షలను పరిశీలిస్తున్న ఎఐ అవినాష్

విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలని ఎఐ ఎస్ అవినాష్ అన్నారు. మండలంలోని గాదిలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు రాస్తున్న పి ప్రిపరేషన్ పరీక్షలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చిలో జరగబోయే పబ్లిక్ పరీక్షల్లో ఎటువంటి ఆందోళనకు గురికాకుండా పరీక్షలు రాస్తూ మంచి ఫలితాలను రాబట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్పారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

కురుపాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శనివారం వైడిఒ నెట్వర్క్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై కళా జాతా ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఐవి వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోకిన వారికి అందించే వైద్య సేవలు, వారితో మెలిగే విధానాలు గూర్చి తదితర పాటల ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైడిఒ నెట్వర్క్ ప్రతినిధి గీతారాణి , కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి

వీరఘట్టం: విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఎంఇఒ- 2 ఆర్.ఆనందరావు హెచ్‌ఎం లక్ష్మిని ఆదేశించారు. మండలంలోని అచ్చిపువలస గిరిజన ఆశ్రమ పాఠశాలను శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. రుచికరమైన ఆహారం వల్ల విద్యార్థుల ఆరోగ్యం బాగుంటుందని, తద్వారా విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించడంతో పాటు పరిసరాలు కూడా పరిశీలించారు.

గిరిజనులకు పోడు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - బెలగాం

సాలూరు మండలం జిల్లేడువలస, బొర్రాపనువలస గిరిజనులకు పోడు పట్టాలు ఇస్తామన్న హామీని అమలు చేయాలని, గిరిజనుల మధ్య తగాదాలు పెట్టిన సాలూరు తహశీల్దార్ బాలమురళీకృష్ణ, వీఆర్‌ఓ కృష్ణ మూర్తిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతు సంఘం, కలెక్టర్‌కు గిరిజనసంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు వవలతం సుందర్రావు, గాసి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు కలెక్టర్‌కు శనివారం వినతిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో సర్వేలు చేసిన వారందరికీ పట్టాలు వెంటనే పంపిణీ చేయాలని కోరుతూ మాట్లాడుతూ గతంలో గిరిజనులకు, 'పేదలకు ఉపయోగకరమైన పేరుతో సర్వేలు చేశారని, అయితే నేటికీ పూర్తిస్థాయిలో పట్టాలు పంపిణీ చేయలేదని తెలిపారు. జిల్లేడువలస, గాదిలవలస గ్రామాల గిరిజనుల మధ్య భూ సమస్య వస్తే అప్పట్లో రెవెన్యూ అధికారులు న్యాయం చేస్తామని రెండు గ్రామాల గిరిజనులకు సర్వేలు చేసి అదే ప్రాంతంలో సాగులో ఉన్న బొర్ర పనుకువలస గ్రామంతో కలిపి ఒకేసారి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన హామీని అమలు చేయ కుండా మూడు గ్రామాల్లో ఒకటైన గాదిలవలస గ్రామానికి మాత్రమే పట్టాలు పంపిణీ చేసి అన్యాయం చేశారని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై రెవెన్యూ అధికారులను అడగ్గా సరైన సమాధానం చెప్పకుండా సమస్య పరిష్కారం చేయకుండా తాత్సారం చేస్తూ రోజులు గడుపుతున్నారని అన్నారు. ఈ సమస్యకు కారణమైన తహశీల్దార్, వీఆర్‌ఓపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఉన్న పటాలను పంపిణీ చేయాలని కోరారు. లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కలెక్టర్‌కు రైతు, గిరిజన సంఘాల వినతి



సాలూరు రూరల్: మాట్లాడుతున్న కొయ్యాన శ్రీనివాసరావు

నిరసన శిబిరానికి సంఘీభావం

సాలూరురూరల్: గిరిజనులకు వెంటనే పట్టాలివ్వాలి పుష్కరాల సమన్వయ కమిటీ సభ్యులు కొయ్యాన శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. జిల్లేడువలస, బొర్రాపనుకువలస గ్రామాల గిరిజన గ్రామంలో గతంలో సర్వే చేసి పట్టాలు ఇస్తామని మోసగించిన తహశీల్దార్ బాలమురళీకృష్ణ, వీఆర్‌ఓ శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం నిర్వహిస్తున్న నిరసన దీక్ష శిబిరానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వారికి మద్దతుగా మాట్లాడుతూ అధికారులు అందర్నీ ఒకేలా చూడాలని, అలా కాకుండా గిరిజనుల మధ్యనే తగాదాలు పెట్టేలా వ్యవహరించి ఒక గ్రామానికి పట్టాలు అందజేసి మిగతా గ్రామాలను నిరాకరించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి గిరిజనులకు సాగు చేస్తున్న భూములకు పట్టాలను అందజేసి వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు వి.సుందర్రావు, కార్యదర్శి గెమ్మెల గాసి, మెల్లిక అయోధ్య, నాగేశ్వరరావు, చినబాబు, నర్సింగరావు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో నిఘా బృందాలు కీలకం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఎన్నికల నిర్వహణలో నిఘా బృందాలు, ఫ్లయింగు స్క్వాడ్లు చాలా కీలకమని, పర్యవేక్షణ పకడ్బందీగా చేయాలని ఇన్‌ఛార్జి జాయింటు కలెక్టరు సి.విష్ణు చరణ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విజిలెన్స్ బృందాలు, ఫ్లయింగ్‌స్క్వాడ్‌ల సిబ్బందికి వారి విధులు, బాధ్యతలపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో జాగరూకతతో వ్యవహరించాలన్నారు. నిబంధనల ప్రకారం పనిచేయాలని, వీటిపై పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. ఎలాంటి అనుమానాలున్నా శిక్షణా సమయంలోనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. డిఆర్ఒ జి.కేశవనాయుడు మాట్లాడుతూ విజిలెన్స్ బృందాలు, ఫ్లయింగు స్క్వాడ్లు, సిబ్బందికి వారి విధులపై పూర్తి అవగాహన ఉండాలని, ప్రజలు తమ వద్ద ఉంచుకొనే డబ్బు, బంగారం పరిమితి గురించి తెలుసుకోవాలని తెలిపారు. సరైన పత్రాలు చూపని డబ్బులు, పరిమితికి మించి బంగారం ఉన్నపుడు, ప్రజలను ప్రలోభాలకు గురిచేసే వస్తువులు రవాణా వంటి వాటిని అరికట్టడంలో బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ప్రతి ప్రక్రియ వీడియోలోనిక్షిప్తం చేయాలని తెలిపారు. స్త్రీలను తనిఖీ చేసినపుడు మహిళాసిబ్బందిని మాత్రమే వినియోగించాలని సూచించారు. సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా, ఎన్నికల ప్రక్రియ విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ శిక్షణకు నిఘా బృందాలు, ఫ్లయింగు స్క్వాడ్ల సిబ్బంది హాజరైనారు.

80 శాతం పోలింగ్ పెంచే లక్ష్యంగా 'స్వీప్'

జిల్లాలో పోలింగ్ 80 శాతానికి పెంచే లక్ష్యంగా ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ స్వీప్ కార్యక్రమాలు చేపట్టాలని డిఆర్ఒ జి.కేశవ నాయుడు తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో స్వీప్ కార్యక్రమం రాయబారులకు జరిగిన శిక్షణా కార్యక్రమం జరిగింది. అనంతరం డిఆర్ఒ మాట్లాడుతూ ఓటర్లలో చైతన్యం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకొనేలా ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. స్వీప్ జిల్లా నోడల్ అధికారి ఎ.రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచి ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకొనేలా జిల్లాలో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా అర్బన్ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు చేపడుతున్న కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అర్హులైన వారు ఇంకా ఓటరు జాబితాలో నమోదు కాకుంటే తక్షణం ఫారం-6 ద్వారా ఓటర్ నమోదు చేసుకునే అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాధారణ ఎన్నికలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల వరకు ఓటర్లు జాబితాలో డిలేషన్స్ కరెక్షన్సుకు అవకాశం ఉంటుందని ఎన్నికల నోటిఫికేషన్ జారీకి ముందే ఓటరుగా నమోదు కావాలాన్నారు. కార్యక్రమంలో వివిధ కాలేజీల ప్రిన్సిపాళ్ళు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల్లో పనిచేసే క్యాంపస్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎంపిపి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని సమస్యలు తెలియజేస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపిపీ శెట్టి శ్యామల అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి శ్యామల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి హాజరయ్యారు. అనంతరం వివిధ శాఖ అధికారులు అభివృద్ధి సమస్యలపై తమ నివేదికలు చదివి వినిపించారు. ముందుగా ఎఒ శంకరరావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను పూర్తి స్థాయిలో కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు చేపట్టడంతో సకాలంలో కొనుగోలు జరిగిందని వివరించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఇ-క్రాప్ నమోదు చేస్తేనే పండించిన పంటకు గిట్టుబాటు ధర కొనుగోలు జరుగుతుందన్నారు. అలాగే పిఎం కిసాన్, రైతు భరోసా పథకానికి నిధులు జమ కావాలంటే తప్పనిసరిగా రైతులు ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు. మండలంలోని తాగునీటి సమస్య అధికంగా ఉందని, జలజీవన్ మిషన్ ద్వారా వేసిన ఇంటింటి కుళాయిలు సక్రమంగా పనిచేయడం లేదని ప్రజాప్రతినిధులు సమావేశంలో తెలిపారు. నెలలు తరబడి పనులు చేస్తున్నా కనీసం మంచినీరు సదుపాయం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ఎంపిపి, జెడ్‌పిటిసి స్పందిస్తూ ప్రజా సమస్యలు పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, వీధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లికార్జునరావు, ఉపతహశీల్దార్ శివయ్య, వైఎస్ ఎంపిపి శరత్‌బాబు, అన్నపూర్ణ, ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎంపిపి శెట్టి శ్యామల



మాట్లాడుతున్న అధికారి

సమస్యలు పరిష్కరించేలా తీర్మానాలు చేయాలి

మండలంలోని మూడు నెలలకొకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలను పరిష్కరించేలా తీర్మానాలు చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సర్వసభ్య సమావేశంలో సిపిఎం ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని నిరసన చేపట్టారు. అనంతరం ఎంపిడిఒ మల్లికార్జునరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ పూర్ణపాడు లాబేసు వంతెన పనులు పున ప్రారంభించాలని, ఏనుగులను అడవికి లేదా జూకి తరలించాలని డిమాండ్ చేశారు. కూనేరు నుండి లంజ గ్రామం వరకు బస్సు సౌకర్యం కల్పించాలని, కూనేరు నుంచి పార్వతీపురం వరకు మూడు రాష్ట్రాలకు వెళ్లే అంతర్ రాష్ట్ర రహదారి పైన గోతులు కప్పాలని కోరారు. కూనేరు వరకు రాత్రి వేళ నైట్ హాల్ట్ బస్సు వేయ్యాలని, ఉపాధి హామీ పనులు ఒక్క పూట కల్పించాలని, పెండింగ్ హౌసింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉపేంద్ర, రామారావు, శివుని నాయుడు ఉన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను పర్యవేక్షించాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

దీర్ఘకాలికమైన వ్యాధిగ్రస్తుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. సన్యాసిరాజుపేట (ఎస్ఆర్‌పేట) లో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య తనిఖీలు, నిర్ధారణ పరీక్షలు, చికిత్సా వివరాలు రికార్డులను పరిశీలించారు. అక్కడ రోగులు, గర్భిణీలతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలికమైన అనారోగ్య సమస్యలున్న వారి ఆరోగ్యం ఏ మేరకు మెరుగుపడుతున్నదీ పర్యవేక్షించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం సిబ్బందితో కలిసి నాడీ వ్యవస్థకు సంబంధించిన దీర్ఘ కాలిక వ్యాధిగ్రస్తుని గృహ సందర్శన చేసి ఆరోగ్య పరిశీలన చేశారు. వారికి అందజేసిన మందులను పరిశీలించారు. అనంతరం ఆయన వీధుల్లో ఉన్న కిరాణా షాపుల వద్దకు వెళ్లి చెత్త తొట్టెలను ఉంచాలని, ప్లాస్టిక్ తదితర వ్యర్థ పదార్థాలను కాల్వల్లో పడవేయరాదని స్పష్టం చేశారు.



మందులను పరిశీలిస్తున్న డిఎంఒ జగన్‌మోహన్‌రావు

గ్రామంలో జ్వరాలు గుర్తిస్తే వెంటనే తెలియజేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిశీలన చేసి ఆరోగ్య సూత్రాలు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌కుమార్, సిబ్బంది రవణమ్మ, ఇంద్రాణి, రమేష్, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, జగదీష్, ఆశా కార్యకర్తలు ఉన్నారు.


అప్పన్నదొరవలసలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని అప్పన్నదొరవలస పాఠశాల విద్యార్థులకు, రోగులకు శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆర్. రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ చీకటి శంకరరావు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత పాటించవలసిన జాగ్రత్తలు గూర్చి వివరించారు. అనంతరం అంగన్వాడి కేంద్రానికి వెళ్తున్న పిల్లలకు బరువు, ఎత్తు సరిపోయిందో లేదో చూసి చిన్నారుల ఆరోగ్యం పై తల్లిదండ్రులకు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

సీతానగరం: మండలంలోని జోగింపేట, కస్తూరిబా పాఠశాల, అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు శనివారం సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పావని ఉచిత శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ హెచ్ఎస్‌సి వైద్య సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస: విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కొండ చీపుర్ల విక్రయాలతో ఆదాయం

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన ప్రాంతాల్లో లభ్యమయ్యే కొండ చీపుర్లు సేకరించి వాటిని విక్రయిస్తే గిరిజనులకు ఆదాయం పెరుగుతుందని డ్వామా ఇన్‌ఛార్జి పీడీ వై.సత్యంనాయుడు అన్నారు. మండలంలోని పెదశాఖలో విడివికె ద్వారా కొండచీపుర్ల విక్రయం, శిక్షణా కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతాల నుంచి సేకరించిన కొండ చీపుర్లను కట్టడంపై పలు సూచనలు, సలహాలు సభ్యులకు చేశారు. మండలంలో 50మంది సభ్యులకు ఆదేశాల మేరకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. శిక్షణకు వచ్చిన ఒక్కొక్క సభ్యునికి రోజుకు రూ.150 ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణను పూర్తిస్థాయిలో సభ్యులు సద్వినియోగం చేసుకొని వారి జీవనోపాధిని మెరుగుపర్చుకోవాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో లభ్యమయ్యే అటవీ ఉత్పత్తులను విడివికెల ద్వారా అమ్మకాలు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. కొండచీపుర్లను సేకరించి తయారుచేసి అమ్మకాలు చేసి వచ్చిన లాభాన్ని ఆయా విడివికె సభ్యులకు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిపిఎంలు ప్రవీణ్, ఫైనాన్స్ అప్పారావు, ఎపిఎం వెంకటరమణ, విడివికెసభ్యులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జీ పీడీ వై.సత్యంనాయుడు

అటవీ ఉత్పత్తి ప్రణాళికలు సిద్ధం చేయాలి

సీతానగరం: డ్వాక్రా సంఘ సభ్యులు అటవీ ఉత్పత్తులపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వెలుగు పీడీ వై సత్యంనాయుడు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం మహిళా సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ఉత్పత్తులను డ్వాక్రా సంఘ సభ్యులకు అందించే విధంగా ప్రణాళిక ఉండాలన్నారు. వస్తువులలో నాణ్యత తక్కువ ధరకు ఇవ్వడం జరుగుతుందని వీటిని మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కలిగించి కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిపిఎం ప్రవీణ్ కుమార్, అప్పారావు, ఎపిఎం ఆర్ శ్రీరాములనాయుడు, సీసీలు కోటి, ఆనంద్‌తో పాటు మహిళా సమాఖ్య సభ్యులు వివిధ గ్రామాలకు చెందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని బుదురువాడ పంచాయతీ పరిధిలో గల గిరిజన రైతులకు 198 రీసర్వే పట్టాలను శనివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పంపిణీ చేశారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా విడతల వారీగా రాష్ట్రం లో గల రైతన్నల భూముల రీ సర్వే నిర్వహించి వారికి కచ్చితమైన హద్దులతో ఎటువంటి తగాదాలు, గొడవల్లేని విధంగా రైతులకు శాశ్వత భూహక్కు కల్పిస్తూ వారి పేరిట పట్టాలను పూర్తిగా ఉచితంగా పంపిణీ చేశామ న్నారు. అలాగే 20 ఏళ్ల క్రితం గిరిజనులకు జారీ చేసిన డి-పట్టా భూము లపై శాశ్వత భూ హక్కు కల్పిస్తూ జిరాతీ పట్టాలను సైతం గిరిజనులకు అందజేశామన్నారు. అనంతరం పంచాయితీలోని నాలుగు గ్రామాల రైతులకు పట్టాలను స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు సమక్షంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, నాయకులు మజ్జి శేఖర్, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, రైతులు, రెవిన్యూ అధికారులు, పాల్గొన్నారు.

ముందస్తు నోటీసులు అన్యాయం

కురుపాం: ఉద్యోగుల హక్కుల కోసం ఈనెల 27న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న ఉద్యోగులకు ముందస్తుగా పోలీసులు నోటీసులు జారీ చేయడం అన్యాయమని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.శ్రీరాములు, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. కరువులు, ఎం.చలపతిరావు అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ ఉద్యోగ జెఎసి పిలుపు మేరకు అన్ని శాఖల ఉద్యోగులు శాంతియుతంగా చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టి, ఉద్యోగుల బకాయిలు, పిఆర్సి, డిఎ తదితర అంశాలు సాధనకు వెళ్తుంటే విధి నిర్వహణలో ఉన్న పాఠశాల, కార్యాలయాలకు ఉన్న ఉద్యోగుల వద్దకు పోలీసులు వెళ్లి ముందస్తు నోటీసులు జారీ చేయడం సమంజసం కాదని అన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి పోలీసులు ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- సాలూరు

పట్టణంలోని అక్కేన వీధి, శతపతి వీధులకు చెందిన యర్రా అప్పలనాయుడు, మార్పిన పద్మలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3.47లక్షల చెక్కులను డిప్యూటీ సీఎం రాజన్నదొర పంపిణీ చేశారు. ఆయన నివాసంలో లబ్దిదారులకు ఈ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు వున్నారు.

వీరఘట్టం: మండలంలోని పనస నందివాడ గ్రామానికి చెందిన దమరసింగి గారయ్యకు రూ.1.20లక్షల చెక్కును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ జిల్లా పరిషత్తు చైర్మన్ పాలవలస రాజశేఖర్ అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరికన సన్యాసినాయుడు, గంగు నాయుడు, బొత్స ప్రకాశరావు, బొమ్మాలి జీవరత్నం, సుందర్‌రావు, డీ కూర్మినాయుడు పాల్గొన్నారు.

జిల్లా ప్రతినిధుల నియామకం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఎపి పార్వతీపురం మన్యం జిల్లా ప్రతినిధులను నియమించి నట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు శిఖరం నరహరి, విజయనగరం జిల్లా అధ్యక్షులు దాసరి సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆకాంక్షలను విద్యార్థుల భవిష్యత్తుకు తగిన విద్యా అవకాశాలకు మార్గం చూపే వేదిక ఈ పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేటు విద్యాసంస్థలు చేస్తున్న దోపిడీ అన్యాయాలపై ఆర్గనైజేషన్ విద్యార్థుల పక్షాన పోరాడుతుందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో కన్వీనర్ వంగల దాలినాయుడు, కో కన్వీనర్లు జీవి రమణారావు, తోట జీవాకు తమ సంస్థ తరపున ప్రతినిధులుగా పనిచేస్తారన్నారు. జిల్లాలో విద్యార్థు లకు సంబంధించి ఏ సమస్య ఉన్న వారి దృష్టికి తీసుకువెళ్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తారన్నారు.

విద్యా ప్రమాణాలు భేష్

ప్రజాశక్తి - వీరఘట్టం

ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల విద్యార్థుల విద్యా ప్రమాణంలో బేస్‌గా ఉన్నాయని రాష్ట్ర ఎల్‌ఐపి నోడల్ అధికారి శైల కల్పన సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల లెసన్, నోటు పుస్తకాలు, తదితరమైనవి క్షుణ్ణంగా పరిశీలించారు. ఎల్‌ఐపి కార్యక్రమంలో భాగంగా లక్ష్యం అనే యాప్‌ను ఉపాధ్యాయులకు ఇన్‌స్టాల్ చేసి దాన్ని ఉపయోగిం చాలని సూచించారు. ఈమెతోపాటు ప్రధానోపాధ్యా యులు బి సుంబోరా, విద్యార్థులు పాల్గొన్నారు.

1న జాబ్‌మేళా

పాలకొండ : ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా ఈనెల 1న శుక్రవారం స్థానిక సత్యసాయి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యూ.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో టెక్ తమ్మినా, డెక్కన్ ఫైన్ కెమికల్స్, అరబిందో ఫార్మా, ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, హెటెరో డ్రగ్స్, మేధా సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, ముతుట్ ఫైనాంక్, పే టిమ్, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, బిఫిల్, టీమ్‌లీజ్, కెప్‌స్టోన్ సర్వీస్ లిమిటెడ్, కంపెనీ ప్రతినిధులు హాజర్యై అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. కావున ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత తమ వివరాలను ములను skilluniverse.apssdc.in వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవా లని అన్నారు. మరిన్ని వివరాలకు 79937 95796, 70320 60773, 6301275511 నందు సంప్రదించగలరు.

పరీక్షలకు 484 మంది : డిడి

ప్రజాశక్తి- సీతంపేట



డిడి అన్నదొర

సీతంపేట ఐటిడిఎకు అనుబంధంగా ఉన్న గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ ఉన్నత పాఠశాల నుండి ఈ ఏడాది పది పరీక్షలకు 484 మంది విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నదొర తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 29 ఆశ్రమ ఉన్నత పాఠశాల నుండి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. విద్యుత్తు, తాగునీరు, మెడికల్ కిట్లు, బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

సాదాసీదాగా సమావేశం

పాలకొండ: స్థానిక నగరపంచాయతీ సర్వసభ్య సమావేశం శనివారం సాదాసీదా గా జరిగింది. డంపింగ్ యార్డ్‌ను కొత్త వీధి నుండి తరలించకపోతే రాజీనామా చేస్తానని కౌన్సిలర్ వెలమల మన్మధరావు హెచ్చరించారు. దీనిపై కమిషనర్ సర్వేశ్వరరావు స్పందిస్తూ ఎమ్మెల్యే సహకారంతో బత్తులవాని చెరువు దగ్గర డంపింగ్ యార్డ్‌కు తాత్కాలికంగా స్థలం గుర్తించామన్నారు. ఇరిగేషన్ అధికారులతో కూడా ఎమ్మెల్యే మాట్లాడారని, డంపింగ్ యార్డ్‌ను తరలిస్తామని చెప్పారు. ఐటిడిఎ బంక్ ప్రారంభోత్సవానికి చైర్ పర్సన్‌తో పాటు స్థానిక కౌన్సిలర్‌ను ఆహ్వానించకపోవటం ఏమిటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో చైర్ పర్సన్ యందవ రాధకుమారి, వైస్ చైర్మన్లు రౌతు హనుమంతరావు, పల్లా ప్రతాప్ ఉన్నారు.